సాక్షి ఒడిశా
శుక్రవారం, 18, ఏప్రిల్, 2025



తొలగిన వివాదం

బిజూ విగ్రహ ప్రతిష్టపై వివాదం తొలగింది. విగ్రహ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

-10లో▸



శ్రమదానంతో రోడ్డు..

జంబుగుడలో స్థానికులే రోడ్డు వేసుకున్నారు. ఓ యువకుడు నాయకత్వం వహించాడు.

-10లో▸



అమ్మవారి పండుగలు

పర్లాఖిమిడిలోని పలు ప్రాంతాల్లో అమ్మవారి పండుగలు జరుగుతున్నాయి. ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

-10లో▸

న్యూస్‌రీల్

6 అంబులెన్స్‌ల వితరణ



అంబులెన్స్‌లు ప్రారంభిస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లా ప్రజలకు సేవలు అందించడానికి నాల్కో 6 అంబులెన్స్‌లు వితరణగా అందజేసింది. కొరాపుట్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వి.కీర్తివాసన్ జెండా ఊపి ఈ అంబులెన్స్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. కొరాపుట్ జిల్లాలోని దమంజోడిలో భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) పరిశ్రమ బాక్సైట్ పరిశ్రమ ఉంది. నాల్కో ఫెరిఫెరి డవలప్‌మెంట్ నిధులను కేటాయించడంతో అంబులెన్స్ వాహనాలు జిల్లా అధికార యంత్రాంగానికి అందాయి. కార్యక్రమంలో జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక, ఎమ్మెల్యేలు తారాప్రసాద్ బాహిణీపతి, పవిత్ర శాంత, రఘురాం మచ్చో, రుపుదర్ బొత్రాలు పాల్గొన్నారు.

అధ్యక్ష పదవికి నవీన్ నామినేషన్



నామినేషన్‌పై సంతకాలు చేస్తున్న నవీన్ పట్నాయక్

కొరాపుట్: బిజూ జనతా దళ్ అధ్యక్ష పదవికి మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. భువనేశ్వర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఎన్నికల రాష్ట్ర రిటర్నింగ్ అధికారి ప్రతాప్ కేసరి దేవ్‌కి నామినేషన్ పత్రాలు అందజేశారు. నవీన్ ఒక్కరే అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. 1997లో దివంగత మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ మృతి చెందారు. అనంతరం నవీన్ పట్నాయక్ జనతా దళ్ పార్టీ నుంచి బయటకు వచ్చి 1998లో బీజేడీని స్థాపించారు. అప్పటి నుంచి ఆయనే అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. తమ అధినేత నవీన్ ఇది వరుసగా 9వ సారి నామినేషన్ దాఖలు చేయడమని సీనియర్ నాయకుడు బృగు భక్షిపాత్రో పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బబి దాస్, దేవి మిశ్ర, సంజయ్ దాస్ వర్మ, చంద్రశేఖర్ సాహు, ప్రమిలా మాలిక్, విక్రమ అరుఖ్ తదితరులు పాల్గొన్నారు.

కేరళలో వలస కార్మికుడు మృతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ హరిజన వీధికి చెందిన ఉశాంత్ కుమార్ మల్లి (38) అనే వలస కార్మికుడు కేరళలో కోచి జిల్లా అటోని వద్ద బస్సు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. పేద కుటుంబానికి చెందిన ఉశాంత్ కుమార్ మల్లి కొన్ని నెలలుగా కేరళ రాష్ట్రం కోచిలోని ఒక ప్రైవేటు హోటల్‌లో పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని జిల్లా శ్రామిక అధికారి, మోహానా అధికారుల ఆర్థిక సాయంతో గురువారం హరిజన వీధికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. పేద కుటుంబానికి చెందిన ఉశాంత్ కుమార్ మల్లి కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని కలెక్టర్‌ను మృతుని కుటుంబీకులు కోరుతున్నారు.

కింగ్‌కోబ్రా కలకలం



కింగ్ కోబ్రాను పట్టుకున్న సేనాపతి

రాయగడ: జిల్లాలోని కొలనారలోని ఓ స్టోన్‌క్రషర్ పవర్ జనరేటర్ గదిలో కింగ్‌కోబ్రా కలకలం సృష్టించింది. గురువారం ఉదయం ఎప్పటిలాగే క్రషర్ మెషీన్‌ను ఆపరేట్ చేసేందుకు జనరేటర్ గదిలోకి వెళ్లిన సిబ్బందికి గదిలో ఓ మూల పాము బుసలు కొడుతూ కనిపించడంతో ఉలిక్కిపడ్డారు. ఒక్కసారిగా పామును చూసి బయటకు పరుగులు తీశారు. అనంతరం స్థానిక స్నేక్ స్నేచర్ ప్రదీప్ సేనాపతి సంఘటన స్థలానికి చేరుకుని సుమారు గంటపాటుగా శ్రమించి పాముని పట్టుకున్నాడు. సమారు 13 అడుగుల కింగ్ కోబ్రా పాముగా గుర్తించారు. పట్టుకున్న అనంతరం సమీపంలో గల అడవుల్లో విడిచిపెట్టినట్లు సేనాపతి తెలియజేశారు.

బిజూ పట్నాయక్‌కు.. ఆత్మీయ నివాళి



తండ్రి బిజూ విగ్రహానికి నమస్కరిస్తున్న నవీన్



బిజూ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి, ఉప ముఖ్యమంత్రులు కేవి సింగ్ దేవ్,ప్రభాతి పరిడా

కొరాపుట్:

ఉత్కళ వర పుత్రుడు, మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నయక్ వర్ధంతి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. పార్టీలకు అతీతంగా బిజూను అంతా స్మరించుకున్నారు. రాజధాని భువనేశ్వర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రబాతి పరిడాలో బిజూ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పార్టీ శ్రేణులతో కలసి వెళ్లి నివాళులర్పించారు. కొరాపుట్,నబరంగ్‌పూర్ జిల్లాల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు.

రాయగడలో..

రాయగడ: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా వర పుత్రుడు బిజు పట్నాయక్ 28 వ వర్ధంతిని ఆ పార్టీ శ్రేణులు గురువారం జరుపుకున్నారు. స్థానిక కొత్తీ బస్టాండు వద్ద గల బిజు విగ్రహానికి రాజ్యసభ మాజీ ఎంపి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను నెక్కంటి ఈ సందర్భంగా కొనియాడారు.

జయపురంలో..

జయపురం: ఉత్కళ వరపుత్రుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ బిజూ పట్నాయిక్ వర్ధంతి గురువారం జయపురం బీజేడీ శ్రేణులు జరుపుకున్నాయి. స్థానిక బిజూ భవనంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి రబినారాయణ నందో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయిక్ 28వ వర్ధంతి సభను బీజేడీ పార్టీ శ్రేణులు పర్లాకిమిడిలో జరుపుకున్నారు. తొలుత మహేంద్రతనయ నది వద్ద బిజూ పట్నాయిక్ ఆత్మకు శాంతిచేకూరాలని తర్పణాలు విడిచారు. అనంతరం హైస్కూల్ జంక్షన్ వద్ద బిజూ పట్నాయక్ విగ్రహానికి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, బీజేడీ జిల్లా అధ్యక్షులు ప్రదీప్ నాయక్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నీలమ్మ గుడి వెనుక ఉన్న బీజేడీ పార్టీ కార్యాలయంలో శ్రద్ధాంజలి సభలో పాల్గొన్నారు. బిజూ పట్నాయిక్ ఒడిశా వరపుత్రుడని రాష్ట్రంలో ప్రగతి ప్రధాన నడిపించిన మహా నేతని సీనియర్ బీజేడీ నాయకులు ఎస్.గజపతి రావు అన్నారు.



జయపూర్‌లో నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి రబినందో, మున్సిపల్ వైస్ చైర్మన్ బి.సునీత తదితరులు



పర్లాకిమిడి: బిజూ పట్నాయక్‌కు శ్రద్ధాంజలి తెలుపుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



పర్లాకిమిడి: బీజేడీ పార్టీ కార్యాలయంలో శ్రద్ధాంజలి సభలో



నబరంగ్‌పూర్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ ఎంపీ ప్రదీప్ మఝి,మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని



రాయగడ:బిజూ విగ్రహానికి నివాళులు అర్పించిన బీజేడీ నాయకుడు నెక్కంటి, కార్యకర్తలు, నాయకులు

రక్తదాన శిబిరం



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ పాత్రో ప్రారంభించారు. మొత్తం 18 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అన్ని దానాల్లోకి రక్తదానం గొప్పదన్నారు. సమయానికి రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీవో సురాజ్ కుమార్ మహాపాత్రో, మల్కన్‌గిరి రెడ్‌క్రాస్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల నగరంలో నివాసముంటున్న దిలీప్ బాగ్ ఈనెల 13వ తేదీన ప్రమాదవశాత్తు మరణించారు. అయితే వారిది నిరుపేద కుటుంబం కావడంతో జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం గురువారం అందజేశారు. బలిమెల ఎన్‌ఏసీ కార్యాలయంలో పురపాలక అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ నాయక్ చేతులమీదుగా రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు మున్న తురాక్ తదితరులు హాజరయ్యారు.

‘ఆ పవర్ ప్లాంట్ కొరాపుట్‌లో లేదు’



దండాబెడలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు



పవర్ ప్లాంట్ ప్రాంతం

కొరాపుట్: ప్రైవేట్ పవర్ ప్లాంట్ కొరాపుట్ జిల్లాలో లేదని గిరిజనులకు జిల్లా అధికారులు వివరించారు. గురువారం కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి దండాబడి గ్రామంలో అధికారులు గ్రామ సభ నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం దండాబడి గ్రామస్తులు జిల్లా అధికారులకు ప్రైవేటు పవర్ ప్లాంట్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దర్యాప్తులో ఆ రెండో ప్లాంట్ కొరాపుట్ జిల్లా పరిధిలో రావడం లేదని స్పష్టం చేశారు. మల్కన్‌గిరి జిల్లాకి చెందుతుందని ప్రకటించారు. ఇది తమ దర్యాప్తులో తేలిందని వివరించారు. అందువల్ల ప్లాంట్ యాజమాన్యంపై తమకు అధికారాలు లేవని పేర్కొన్నారు. ఇదే సభలో పాల్గొన్న ప్లాంట్ ప్రతినిధులు ఈ సమస్య యజమాన్యం దృష్టికి తెచ్చి అందులో దండాబడి గ్రామస్తులకు ఉపాధి కల్పించాలని ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో బొయిపరిగుడ అభిమన్యు కబి సత్పతి,జయపూర్ పారెస్ట్ రిజర్వ్ అధికారి ప్రతాప్ కుమార్ బెహరా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల కోసం పోరాడాలి



మాట్లాడుతున్న నెక్కంటి, వేదికపై హిమిరిక, పట్నాయక్



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

● రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి

రాయగడ: ప్రజా సమస్యపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. స్థానిక తేజస్వీ మైదానం వద్దనున్న బీజేడీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ప్రజల ఆదరణతో పాలించిన నవీన్ పట్నాయక్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయన్నారు. అయితే అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పథకాలు పేర్లు మాత్రమే మార్పులు చేస్తోందన్నారు. సక్రమంగా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. అన్యాయం జరిగిన చోట తాము ఆందోళనలు చేపడతామని తెలియజేశారు. రాష్ట్ర ప్రజల వరపుత్రుడిగా పిలువబడే రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత బిజూ పట్నాయక్ విగ్రహాన్ని తగలబెట్టడం, మొండెం వేరు చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడినవారిపై ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, దీనికి తగిన సమాధానం చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

ప్రణాళికతో ముందుకెళ్లాలి

రాష్ట్రంలో బీజేడీ అధికారంలో లేకపోయినప్పటికీ ప్రజల కోసం నిరంతరం పోరాడుతోందని నెక్కంటి అన్నారు. కార్యకర్తలు ఏమాత్రం అసహనానికి గురవ్వకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, బి.తిరుపతి, సుజాత పాలో, కాసీపూర్ సమితి అధ్యక్షుడు కంతొ మాఝి, రాయగడ సమితి ఉపాధ్యక్షుడు హరప్రసాద్ హెప్రుక తదితరులు పాల్గొన్నారు.

జడలు విప్పిన మూఢ విశ్వాసం



గ్రామస్తుల సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీయడానికి తవ్వకాలు చేస్తున్న కుటుంబ సభ్యులు



సగం తవ్విన సమాధి

కొరాపుట్: మత మూఢ విశ్వాసం జడలు విప్పడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుమిలి గ్రామ పంచాయతీ మాల్బెడ గ్రామానికి చెందిన శ్రావణ్ గొండో (30) మహారాష్ట్రలో జరిగిన ఓ ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. అయితే ఇటీవల శ్రావణ్ మతం మార్చుకున్నాడు. అంత్యక్రియలు కోసం గ్రామ శ్మశానికి తీసుకెళ్లగా గిరిజనులు అడ్డుకున్నారు. తమ మతం కాని వ్యక్తిని ఇక్కడ సమాధి చేయడానికి వీల్లేదని, అతని మతానికి చెందిన శ్మశానం ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లాలని సూచించారు. దీంతో మృతుని కుటుంబీకులు శవాన్ని తిరిగి ఇంటికి తీసుకొని వచ్చారు. అప్పటికే గ్రామంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇది తెలిసి రాయగర్ నుంచి పెద్ద ఎత్తున పోలీసులు బలగాలు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో చర్చలు జరిపారు. అర్ధరాత్రి వరకు సమస్య కొలిక్కి రాకపోవడంతో మృతుని బంధువులు తమ సొంత భూమిలోనే సమాధి చేశారు. ఇది తెలిసి గ్రామస్తులు మృతుని ఇంటిపై దాడి చేశారు. తిరిగి ఆ మృతదేహాన్ని బయటకు తీసి గ్రామం నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఆఖరకు మృతదేహాన్ని బయటకు తీయడం కూడా ప్రారంభించారు. ఇది తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతునికి కుటుంబానికి అండగా నిలిచారు. గురువారం రోజంతా గ్రామస్తులతో అధికారులు చర్చలు జరిపారు. సగం తవ్విన సమాధి వద్ద మృతుని కుటుంబీకులు, పోలీసులు మోహరించారు. పరిస్థితి అదుపులో ఉంచడానికి ప్లటూన్ పోలీసులను అదనంగా గ్రామంలో మోహరించారు.



సమాధి వద్ద విలపిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు



సంఘటన స్థలం వద్ద పోలీసులు



అర్ధరాత్రి గ్రామంలో ఘర్షణ వాతావరణం

క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

కొరాపుట్: ప్రతి ఒక్కరికీ అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ సురేష్ బారిక్ అన్నారు. జయపూర్ మెయిన్ రోడ్డులోని కలకత్తా బజార్ వద్ద రోడ్డుపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పెద్ద భవనాల్లో అగ్ని ప్రమాదాల నుంచి రక్షించుకోవడం కోసం అనేక భద్రతా ఏర్పాట్లు ఉంటాయన్నారు. కానీ ప్రమాదం జరిగినప్పుడు ప్రజలు ప్రాణ భయంతో వాటిని మర్చిపోతారని పేర్కొన్నారు. అందువలన ఆందోళన చెందకుండా భద్రతా ఏర్పాట్లను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం తన సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు.

తాగునీటికి కటకట



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రశాంత కుమార్ ప్రధాన్, తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ ఎస్.కోరడాసింగి గ్రామ పంచాయతీలో బోండా, భయ్యా సాహి, సన్నో లోబ తదితర గ్రామాల్లో సాగునీరు, తాగునీటి వనరులు లేక ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస బాట పడుతున్నారు. ఇటీవల అధిక ఎండలు కారణంగా తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కలెక్టర్ బిజయకుమార్ దాస్‌కు ఆయా గ్రామ ప్రజలు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. రాయఘడ బ్లాక్ డంబాపూర్ వద్ద మహేంద్రతనయ నదిపై ఆనకట్ట పూర్తిచేయాలని ఆయా గ్రామప్రజలు, న్యాయవది ప్రశాంత్ కుమార్ ప్రధాన్ కలెక్టర్‌ను కోరారు.

పది దుకాణాలకు నోటీసులు

జయపురం: ఉత్కళ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 14వ తేదీలోగా అన్ని ప్రైవేట్ వ్యాపార వాణిజ్య సంస్థలకు నేమ్ బోర్డులు ఒడియాలో రాయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఒడియా భాషలో నేమ్ బోర్డులు రాయాలని విస్తృత ప్రచారం చేశారు. చట్టాన్ని, ప్రభుత్వ ఆదేశాలను నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణపై జయపురం లేబర్ విభాగ అధికారి సబిత కుమారి నాయక్ పట్టణంలోని 10 దుకాణాలకు గురువారం నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయక పోతే ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి, కోర్టు ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒడియాలో బోర్డులు రాయని వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ప్రభుత్వ విభాగాలలో ఎక్కువ మంది ఒడియా భాషేతరులు ఉండటం వలన ఒడియా బోర్డులకు తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదని కొంత మంది అభిప్రాయ పడుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత



వాహనంలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి ఎం.వి 17 గ్రామం వద్ద గురువారం వ్యాన్‌లో ఆంధ్రాకు ఆవులను అక్రమంగా తరలించడాన్ని చూసి యువకులు వాహనాన్ని ఆపారు. మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఐఐసీ రీగాన్ కీండో తన సిబ్బందితో వచ్చి వాహనాన్ని సీజ్ చేశారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

బిత్తరబందలో దొంగల హల్‌చల్



మందస: మండలంలోని సాబకోట గిరిజన పంచాయతీ బిత్తరబందలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. బుధవారం రాత్రి కారు, రెండు ద్విచక్ర వాహనాలపై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సవర మల్లిక అనేక మహిళపై దాడి చేసి చెవికి ఉన్న బంగారపు రింగులను పట్టుకుపోయారు. ఈ సమయంలో ఆమె ప్రతిఘటించగా కత్తితో దాడికి పాల్పడ్డారు. బాధితురాలిని స్థానికులు గుర్తించి 108 అంబులెన్సులో హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలిసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైపీసీ విద్యార్థులకు అవకాశం

శ్రీకాకుళం రూరల్: ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు పారామెడికల్ నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు రాగోలులోని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 19లోగా దర ఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం కల్పించి ఫీజును జీతంలో మినహాయిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9121999654, 76809 45357 నంబర్‌ను గానీ, రాగోలు జెమ్స్ ఆసుపత్రి లోని బొల్లినేని మెడిస్కిల్స్‌ను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బిజూ విగ్రహ ప్రతిష్టపై తొలగిన వివాదం



పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ప్రతిష్ట పనులు పర్యవేక్షిస్తున్న జయపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.సునీత, కౌన్సిలర్లు



పార్టీ సమావేశంలో మాజీ మంత్రి రబి నారాయణ నందో, శ్రీనివాస్ బాలారాయ్



జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం శశ్యా రెడ్డి రాసిన అనుమతి లేఖ

కొరాపుట్: బిజూ పట్నాయక్ విగ్రహ ప్రతిష్ఠపై ఎట్టకేలకు జయపూర్‌లో వివాదం తొలగిపోయింది. ఈ విగ్రహం ప్రతిష్ఠ పై ఈ నెల 17వ తేదీ లోపు చర్యలు ప్రారంభించకపోతే ఆందోళనకి దిగుతామని బీజేడీ పార్టీకి చెందిన మాజీ మంత్రి రబి నారాయణ నందో హెచ్చరించిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బి.సునీత తాము సూచించిన స్థల ప్రతిపాదనలపై మున్సిపల్ ఈఓ చార్జిలో ఉన్న సబ్ కలెక్టర్ ఆకవరం శశ్యా రెడ్డికి లేఖ రాశారు. దీనికి సబ్ కలెక్టర్ అంగీకరిస్తున్నట్లు బదులిచ్చారు. 15 నుంచి 20 రోజుల్లోపు విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేస్తామన్నారు. గురువారం జయపూర్ విక్రం నగర్ లో బీజేడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రబీ నందో, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ బాలారాయ్ లు మాట్లాడారు. ఈ స్థల సేకరణతో పాటు ప్రతిష్ఠ పనులు ప్రారంభించినందుకు వైస్ చైర్మన్ బి.సునీతతో పాటు బీజేడి కౌన్సిలర్లను అభినందించారు. దీంతో వివాదానికి తెర పడింది. మరో వైపు గురువారం ఉదయం బీ.సునీత నేతృత్వంలో కౌన్సిలర్ల బృందం పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో విగ్రహ ప్రతిష్ఠ చేయాల్సిన ప్రదేశంలో జరిగిన పనులు పర్యవేక్షించారు. ఈ బృందంలో కౌన్సిలర్లు పద్మా రెడ్డి, లక్ష్మీ నారాయణ చౌదరి, దేవో చౌదరి, సుశ్మా మహాపాత్రో, అజిత్ బెహరా ఉన్నారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



శ్రమదానంతో రోడ్డును నిర్మించుకుంటున్న గ్రామస్తులు

రాయగడ: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా శ్రమదానంతో రహదారిని నిర్మించుకున్నారు. ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై తమ గ్రామానికి రోడ్డు వేసుకున్నారు. జిల్లాలోని బిసంకటక్ సమితి కంకుబడి పంచాయతీలోని జంబుగుడలో ఈ ఘటన జరిగింది. జంబుగుడ గ్రామానికి చెందిన ధీరేన్ కద్రక అనే యువకుడికి పెళ్లి సంబంధం కుదిరింది. త్వరలో పెళ్లి ముహూర్తం కూడా నిర్ణయించారు. అయితే తమ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో తన పెళ్లికి రాబోయే బంధువులు, ఆత్మీయులు ఇబ్బందులు పడతారని భావించి పెళ్లికి ముందే గ్రామస్తులతో కలసి మూడు కిలోమీటర్ల రహదారికి అవసరమయ్యే ఖర్చును భరించి స్వయంగా గ్రామస్తులతో కలిసి రహదారిని నిర్మించేందుకు సన్నద్ధమయ్యాడు. అందుకు గ్రామస్తుల అనుమతి కూడా తీసుకున్నాడు. దీంతో అందరూ కలిసి వారం రోజుల పాటు శ్రమించి రోడ్డు వేసుకున్నారు.

అటెండర్ అనుమానాస్పద మృతి!

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్–1లో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్న కొర్రాయి రమణమూర్తి (55) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు సమాచారం. ఈయన టెక్కలి వంశధార కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. సోమవారం నుంచి ఆయన కనిపించడం లేదు. ఆయన వినియోగించే ద్విచక్ర వాహనం కూడా ఇంటి బయటే ఉంది. గురువారం సాయంత్రం ఇంటి లోపల నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇంటి తలుపులు తీసేందుకు ప్రయత్నించగా లోపల గడియ పెట్టి ఉండటంతో వెనక్కి వచ్చేశారు. అనంతరం కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. రమణమూర్తి కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు విశాఖలో ఒక ప్రవేటు కంపెనీలో పనిచేస్తున్నారు.

రెంగాలో బీజేపీ నాయకుల పర్యటన




సమస్యలను వింటున్న బీజేపీ నాయకుడు మాఝి, తదితరులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి రెంగా గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం పర్యటించారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విభాగం ఉపాధ్యక్షులు కాళీరాం మాఝి, జిల్లా కన్వీనర్ దుష్మంత్ కుమార్ సింగ్ దేవ్, నీలాద్రీబిహారి పాత్రో, తదితరులు పర్యటించి అక్కడి వారితో మాట్లాడారు. గ్రామానికి కనీసం సరైన రహదారి కూడా లేదని నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. వంద కుటుంబాలు నివసిస్తున్న గ్రామంలో ఆవాస్ గృహాలు ఇంతవరకు ఎవ్వరికీ మంజూరు చేయలేదన్నారు. తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రతీ గ్రామంలో పర్యటించి మౌలిక సౌకర్యాలు, సమస్యలను తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని మాఝి తెలియజేశారు.

- ఏడాది పొడవునా జలకళ
- ఆరు నెలలు సాగునీరు.. ఆరు నెలలు ఉప్పునీరు
- లబ్ధి పొందుతున్న వ్యవసాయ, ఆక్వా రైతులు

సుజలాం.. సుఫలాం

ముసళ్ల ఖానా @ 100



ముసళ్లఖానా గుండా ప్రవహిస్తున్న నీరు

సంతబొమ్మాళి :

బ్రిటీష్ కాలంలో నిర్మాణం జరుపుకుని వందేళ్ల చరిత్ర కలిగిన ముసళ్ల ఖానాకు ఓ ప్రత్యేకత ఉంది. మండువేసవిలో సైతం నిండుకుండలా ఉంటూ ఇటు వ్యవసాయ రైతులకు సాగునీరు, అటు ఆక్వా రైతులకు ఉప్పునీరు అందిస్తూ ఆసరాగా నిలుస్తోంది. నౌపడ నుంచి వెంకటాపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో సీతానగరం వద్ద ఉన్న ఈ ముసళ్లఖానాకు వందేళ్ల పైబడి చరిత్ర కలిగి ఉంది. ఒకప్పుడు ఈ ఖానాలో మొసళ్లు సంచరించేవని, అందుకే మొసళ్ల ఖానాగా పిలిచేవారని స్థానికులు చెబుతుంటారు. కాలక్రమేణా ఆ పేరు ముసళ్ల ఖానాగా మారిపోయిందని అంటుంటారు.

నిత్యం జలకళ..



నిండుకుండలా ప్రవహిస్తున్న నీరు

ఈ ఖానా గుండా ఏడు కిలో మీటర్లు దూరం నీరు పయనిస్తూ భావనపాడు వద్ద సముద్రంలో కలుస్తుంటుంది. సంతబొమ్మాళితో పాటు టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి వచ్చే వరద నీరు ఈ ఖానా గుండా ప్రవహించి భావనపాడు సముద్రంలో కలుస్తుండటంతో నిత్యం కళకళలాడుతూ కనిపిస్తుంటుంది. జనవరి నుంచి జూన్ వరకు ఉప్పునీరు, జూలై నుంచి డిసెంబర్ వరకు సాగునీటి ప్రవాహం ఉంటుంది. సీతానగరం, సెలగపేట, ఉయ్యాలపేట, నాయుడుపేటకు చెందిన పలువురు ఆక్వారైతులు సుమారు 100 ఎకరాల్లో ఈ నీటిపైనే ఆధారపడి ఆక్వా సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో జూలై నుంచి వరి సాగుకు ఈ నీటిని రైతులు ఉపయోగిస్తుంటారు. ఇంజిన్ల సహాయంతో సుదూర ప్రాంతాలకు సాగునీటిని రైతులు తరలిస్తుంటారు. సుమారు 500 ఎకరాల వరకు సాగునీరు అందుతుంది. అంతేకాకుండా కార్తీక మాసంలో ఈ ఖానా వద్దే భక్తులు స్నానమాచరిస్తుంటారు. వినాయకుడు, సరస్వతి దేవి, దుర్గాదేవి విగ్రహాలను ఈ ఖానా వద్దే నిమజ్జనం చేస్తుంటారు. నిత్యం వందలాది సంఖ్యలో వాహనాలు ఈ ఖానాపైనే రాకపోకలుసాగిస్తుంటాయి. ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఖానా శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు, పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపయోగకరం..



ఈ ఖానా గుండా ప్రవహించే ఉప్పు నీరు ఆక్వా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. నిత్యం నీరు ఉండడంతో ఏదో విధంగా ప్రజల అవసరాలకు వినియోగిస్తున్నారు. వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన ముసళ్ల ఖానాను పరిరక్షించాలి.

–బి.సుధాకర్, ఎంపీటీసీ, ఆక్వారైతు, సీతానగరం

రైతులకు వరం



వ్యవసాయ రైతులు, ఆక్వా రైతులకు ముసళ్ల ఖానా ద్వారా ప్రవహించే నీరు వరంలా మారింది. సీజన్ బట్టి అందరికీ ఉపయోగపడుతుంటుంది. రోడ్డు విస్తరణ నేపథ్యంలో చరిత్ర కలిగిన ఈ ఖానా ఏ విధంగా రూపాంతరం చెందుతుందో చూడాల్సిందే.

– వాడరేవు కృష్ణారావు, రైతు, సీతానగరం

పట్టణంలో అమ్మవారి పండుగలు



రాంనగర్ నుంచి నీలమ్మగుడికి వెళుతున్న అమ్మవారు



ఊరేగింపులో గజ నెయ్యిముద్ద అమ్మవారు

పర్లాకిమిడి: పట్టణంలో రాంనగర్, ఉప్పరవీధుల్లో అమ్మవారి పండుగ వారాలు జరుగుతున్నాయి. రాంనగర్ వాసులు అమ్మవారిని నెయ్యి ముద్దలా అలంకరించి సంప్రదాయ డప్పు నృత్యాలతో ఉదయాన్నే పట్టణంలో నీలమ్మ గ్రామ దేవత వద్ద అనుపోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పసుపు నీళ్లు, వేపాకుతో చల్లదనం చేశారు.

బలిమెలలో దొండొనచో నృత్యం



అమ్మవారిరి ఊరేగిస్తున్న భక్తులు



దొండొనచొలో పాల్గొన్న పురుషులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్ఏసీ పరిధిలో గల డైలీమార్కెట్ ప్రాంగణంలో మా దండకాళీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దొండొనచో నృత్యం నిర్వహించారు. ఈ నృత్యాలను చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గజేంద్ర మహంతి, ఉపాధ్యక్షుడు రామ్‌చంద్ర బారిక్, కార్యదర్శి బాబుల దురువ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య



పర్లాకిమిడి మెయిన్ మార్కెట్ వద్ద ఉల్లి, బంగాళ దుంపల లోడుతో వాహనం అడ్డంగా నిలుపుదల చేయడంతో ఇక్కట్లు



ఇరుకైన పర్లాకిమిడి మార్కెట్ రోడ్డు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో ప్రజలు ప్రతిరోజూ ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఉదయం పూట బడులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేయడంతో ప్రతి ఒక్కరూ మార్కెట్ జంక్షన్ ప్రధాన కేంద్రంగా పట్టణం నిలిచింది. జిల్లా కేంద్రం పర్లాకిమిడి ఫారెస్టు గేటు జాజిపురం గ్రామం నుంచి నేరుగా బెత్తగుడ మీదుగా గుమ్మ రోడ్డు వరకు అనుసంధానం చేసే బైపాస్ రోడ్డు ఇప్పటి వరకు నిర్మించక పోవడంతో ప్రజలు ప్రతి రోజూ మార్కెట్ జంక్షన్ వద్ద అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట స్కూళ్లకు, ఆఫీసుకు వెళ్లేవారు మార్కెట్ జంక్షన్ వద్ద పెద్ద వాహనాలు, కూరగాయల వాహనాలు నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇద్దరు బాలులు ఈ ట్రక్కుల కింద నలిగిచనిపోయారు. ఐదేళ్ల క్రితం రోడ్లు–భవనాలశాఖ బైపాస్ సర్వే చేపట్టి డీపీఆర్‌లు ప్రభుత్వానికి పంపించడం జరిగింది. అప్పటి కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ జాజిపురం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించడానికి సన్నహాలు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం బైపాస్ రోడ్డుకు ఆమోదం తెలపలేదు. కనీసం ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ కూడా మెరుగుపరచకపోవడం వల్ల పర్లాకిమిడి ట్రాఫిక్ పోలీసు విభాగంపై ప్రజల విమర్శలకు దారితీస్తుంది.

సూపరింటెండింగ్ ఇంజినీర్ వివరణ..

40 కిలో మీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.4కోట్లతో డీపీఆర్‌లు చీఫ్ ఇంజినీర్‌కు పంపాం. ఇప్పటివరకు ప్రభుత్వ అంచనాలు ఆమోదం తెలపలేదని పీడబ్ల్యూడీ రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ అభిషేక్ శెఠీ తెలియజేశారు.

భారీగా బెల్లం ఊట ధ్వంసం



ఎగువబగడలో సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు



చాపరాయిగూడలో స్వాధీనం చేసుకున్న సామగ్రితో సీఐ కృష్ణారావు

మెళియాపుట్టి/పాతపట్నం: గిరిజన గ్రా మాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు ముమ్మరం చేస్తున్నట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ అన్నారు. గురువారం మెళియాపుట్టి మండలం ఎగువబగడ గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 60 లీటర్ల సారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పలువురు సిబ్బంది ఉన్నారు. అదే విధంగా పాతపట్నం మండలం చాపరాయిగూడ పరిధిలో సారా బట్టీలపై దాడులు జరిపారు. 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది సోమనాథం, వాసుదేవరావు, శివ పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

గార: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో ఇప్పటి వరకు న్యాయవాది ఎవ్వరూ లేనివారికి ప్రభుత్వ న్యాయవాదులు నియమించే విషయంలో సహకరిస్తామన్నారు. బెయిల్ పిటీషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహిళా బ్యారెక్‌కు వెళ్లి ముద్దాయిలతో మాట్లాడి కేసుల విషయమై వేర్వేరుగా తెలుసుకున్నారు. రానున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లైబ్రరీ, వంటశాల, జైలు ఆవరణను పరిశీలించారు. ఆయనతో పాటు అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, జైలర్ దివాకర్‌నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బారువ ఎస్ఐ హరిబాబునాయుడు

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రాపురం జాతీయ రహదారి వద్ద గురువారం ఉదయం జరిగి న రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన యువకుడు రుద్రశెట్టి (23) మృతి చెందాడు. బారువ పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన సోదరులు రుద్రశెట్టి, బబ్లూ శెట్టి గుంటూరులో క్వారీ పని చేస్తున్నారు. స్వగ్రామంలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. బేసిరామచంద్రాపురం వద్దకు వచ్చేసరికి డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన డంతో రుద్రశెట్టి ఘటనా స్థలంలోనే మృతి చెందా డు. బబ్లూశెట్టికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రి కి తరలించారు. బారువ ఎస్.ఐ హరిబాబునాయు డు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

క్లుప్తంగా

మెరిట్ జాబితా విడుదల

గుమ్మలక్ష్మీపురం: ఏకలవ్య, ఆదర్శ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు సంబంధించిన మెరిట్ జాబితా, విద్యార్థులు ఎంపికైన పాఠశాలల వివరాలను ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ అధికారిక వెబ్‌సైట్ http://twreircet.apcfss.in లో పొందుపర్చినట్లు గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున విద్యార్థులు/తల్లిదండ్రులు వారి మెరిట్ స్థితిని, ఏ పాఠశాలకు ఎంపికయ్యారో ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకుని తదనంతరం చర్యలకు సిద్ధపడాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు తగిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో 2025 ఏప్రిల్ 21 నుంచి 30వ తేదీలోగా ఆయా ఎంపికైన పాఠశాలలకు హాజరై నమోదు ప్రక్రియను పూర్తిచేసుకోవాలని చెప్పారు. ప్రవేశాలకు గడువును పొడిగించబోరని స్పష్టం చేశారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఇటీవల గుడివాడలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పతకాలు సాధించి విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. స్థానిక కోడి రామ్మూర్తి వ్యాయామ సంఘం ప్రతినిధి, అభినవ భీమ పెద్ది లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో శిక్షణ పొందిన క్రీడాకారులు స్ట్రాంగ్ ఉమన్ జారా గోల్డ్ మెడల్ సాధించగా, ఉదయ్ అనే మరో క్రీడాకారుడు ద్వితీయస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించారు.

బైపీసీ విద్యార్థులకు అవకాశం

శ్రీకాకుళం రూరల్: ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు పారామెడికల్ నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు రాగోలులోని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 19లోగా దర ఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం కల్పించి ఫీజును జీతంలో మినహాయిస్తామన్నారు. పూర్తి వివరాలకు 91219 99654, 76809 45357 నంబర్‌ను గానీ, రాగోలు జెమ్స్ ఆసుపత్రి లోని బొల్లినేని మెడిస్కిల్స్‌ను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

19న వాష్ కేంద్రబృందం సందర్శన

బాడంగి: వాటర్ అండ్ శానిటేషన్, హైజినిక్ (వాష్) కేంద్ర బృందం ఈ నెల 19న బాడంగి మండలం లక్ష్మీపురం గ్రామాన్ని సందర్శించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, గ్రామీణరక్షిత నీటి సరఫరా విభాగం ఏఈఈ రాజశేఖర్ తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా, జల్‌జీవన్‌మిషన్ పనులను పరిశీలిస్తుందన్నారు. ఇందులో భాగంగా గ్రామాన్ని గురువారం పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఢిల్లేశ్వరరావు, పంచాయతీ విస్తరణాధికారి సూర్యనారాయణ, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు పాలవలస గౌరు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. విజయనగరం నియోజకవర్గం కొండకరకాంలో 12 ఎకరాల్లోను, నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం మోదవలసలో 19.8 ఎకరాల్లోను, గజపతినగరం నియోజకవర్గం బొండపల్లి మండలం కొండకిండాంలో 57 ఎకరాల్లోను, రాజాం నియోజకవర్గం రేగిడి ఆమదాలవలస మండలం సంకిలిలో 20 ఎకరాల్లోను, బొబ్బిలి నియోజవర్గం రామభద్రపురం మండలం కొట్టక్కిలో 100 ఎకరాల్లోను, చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలం కుమరాంలోని 10 ఎకరాల్లోను, ఎస్.కోట నియోజకవర్గం కొత్తవలస మండలం బలిఘట్టంలోని 57 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. విజయవాడ ఏపీ సచివాలయంలో సీఎస్ సమావేశ మందిరం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజి ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీరు సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎంఈ సర్వే, నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర, తదితర అంశాలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

తప్పని ఆధార్ తిప్పలు

- కార్డుల్లో మార్పులకు అవస్థలు
- జిల్లాలో పనిచేయని కేంద్రాలు
- సచివాలయాల్లో మూలన పడిన పరికరాలు
- జిల్లా కేంద్రంలో పోస్టాఫీసు వద్ద మాత్రమే నమోదు


హెడ్‌పోస్టాఫీసులో సర్వర్ పనిచేయకపోవడంతో ఖాళీగా ఉన్న ఆధార్ కౌంటర్


ఆధార్ అప్‌డేట్‌కోసం క్యూలో నిల్చొన్న ప్రజలు

పార్వతీపురంటౌన్:


• సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన ఊర్మిళ తన చంటి బిడ్డతో దయనీయంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద వేచిచూస్తోంది. తనకు ఆధార్‌లో అడ్రస్ మార్పు గ్రామ సచివాలయంలో అవడం లేదని జిల్లా కేంద్రంలో బీఎస్ఎన్ఎల్, పోస్టల్ కార్యాలయాల వద్ద అప్‌డేట్ అవుతుందన్న సమాచారం తెలుసుకుని పట్టణానికి వచ్చింది. సర్వర్ పనిచేయడం లేదని, 4గంటల కాలం పాటు వేచి చూసి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయింది.


• కొమరాడ మండలం పొడుగువలస గ్రామానికి చెందిన కిల్లక అరుణ మూడు రోజులుగా ఆధార్ అప్‌డేట్ కోసం వేచి చూస్తోంది. ప్రతిరోజూ బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వచ్చి వేచి చూస్తున్నా ఆమెకు టోకెన్ దొరకడం లేదు. సిబ్బందిని టోకెన్ కావాలని అడగ్గా వారం రోజుల పాటు టోకెన్లు ఇచ్చేశామని, అయినా సర్వర్ పనిచేయడం లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.


• పార్వతీపురం మండలం ఆర్‌కె బట్టివలస గ్రామానికి చెందిన వెంకీ తన కుమార్తె, కుమారుడు నాని, దివ్యల ఆధార్ అప్‌డేట్ చేయడానికి మూడు రోజులుగా పార్వతీపురం పట్టణంలోని పోస్టాఫీసు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ టోకెన్లు లేవన్న కారణంతో అప్‌డేట్ చేయలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నాడు.

ఇలా ఈ ముగ్గురే కాదు. జిల్లాలోని వందలాది మంది ప్రజలు ఎన్ని ఆపసోపాలు పడినా..ఆధార్ కష్టాలు తీరేలా కనిపించడం లేదు. జిల్లాలోని ఏ సచివాలయానికి వెళ్లినా, ఎవరిని అడిగినా జిల్లా కేంద్రంలో పెదపోస్టాఫీసుకు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లండి, అక్కడైతేనే చేస్తారన్న మాటలు వినిపిస్తున్నాయి. దీనికి కారణం జిల్లాలో సరైన ఆధార్ కేంద్రాలు లేకపోవడమేనని తెలుస్తోంది. గతప్రభుత్వం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోక పోవడం, సచివాలయాల్లో సరైన పరికరాలు లేకపోవడం, పరికరాలు ఉన్నా సిబ్బంది అందుబాటులో లేకపోవడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో హెడ్‌పోస్టాఫీసు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాల్లో వారం రోజులకు సరిపడా టోకెన్లు ముందుగానే బుక్ అవుతున్నాయి. దీంతో జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలకు నిరాశే మిగులుతోంది. ఒక రోజుకు వంద టోకెన్లకు పైగా బుక్ అవుతున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వేకువ జామునుంచే పడిగాపులు

హెడ్‌పోస్టాఫీసు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో ఆధార్ మార్పుల కోసం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు వేకువ జామునుంచే టోకెన్ల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం ఈ కార్యాలయాల వద్ద సుమారు 150మందికి పైగా ఒకేసారి వచ్చారు. టోకెన్లు ముందే బుక్ అయ్యాయని తెలియక పడిగాపులు కాశారు. ఈ విషయం ఆలస్యంగా అధికారులు చెప్పడంతో ఉసూరుమంటూ వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరు టోకెన్ల కోసం క్యూలో వేచి ఉన్నారు.

అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమా..?

జిల్లాలో ఆధార్, సెంటర్లు ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రంలో దాదాపు పదుల సంఖ్యలో బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలు ఉన్నా ఎక్కడా సేవలు అందించడం లేదని తెలుస్తోంది. గతంలో సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సిబ్బంది కొరత, పరికరాలను మూలపడేసిన కారణంగా మారుమూల గ్రామస్తులు జిల్లా కేంద్రంలో ఉన్న బీఎస్ఎన్ఎల్, హెడ్ పోస్టాఫీసుకు రావాల్సిన దుస్థితి నెలకొంది.


హెడ్‌పోస్టాఫీసులో వేచి చూస్తున్న వృద్ధులు, చిన్నారులు


బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ అప్‌డేట్ కోసం ఎదురు చూస్తున్న ప్రజలు


ఆధార్ అప్‌డేట్‌కు ఫారం నింపుతున్న మహిళ

కొన్ని సేవలు మాత్రమే..


బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ఫోన్‌నంబర్ అప్‌డేట్, బయోమెట్రిక్, నూతన ఆధార్ నమోదు సేవలు మాత్రమే అందజేస్తున్నాం. మిగిలిన అడ్రస్ నమోదు, పుట్టిన తేదీ, ఫొటోవంటి సేవలు చేసేందుకు సర్వర్ మొరాయిస్తోంది. హెడ్‌పోస్టాఫీసులో సర్వర్లు పనిచేయడం లేదని బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి పంపుతున్నాం. రోజుకు వందకు పైగా నమోదు చేస్తున్నాం.

– రవికుమార్, ఆధార్ అప్‌డేట్ సూపర్‌వైజర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

ప్రతి 3 నెలలకు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ కులాలు, షెడ్యూల్ తెగలపై జరుగుతున్న దాడులపై నిర్వహించే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఇక నుంచి ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. సమావేశం నిర్వహించిన అనంతరం మినిట్స్‌ను కలెక్టర్‌కు పంపాలని, అక్కడి అంశాలపై జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 30న అన్ని మండలాల్లో ఎస్‌హెచ్‌ఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే జరపాలని, ఆ మీటింగ్ మినిట్స్‌ను పంపాలని ఆదేశించారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో కొన్ని చోట్ల స్మశానాలు లేవని, మరికొన్ని చోట్ల ఆక్రమించుకున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ముగ్గురు ఆర్‌డీఓలు అన్ని ఎస్సీ కాలనీల్లో తనిఖీ చేసి శ్మశానాలు ఎక్కడెక్కడ లేవో, ఎక్కడెక్కడ ఆక్రమణకు గురయ్యాయో పరిశీలించి నివేదిక పంపాలని ఆదేశించారు. కొన్ని చోట్ల 2 గ్లాసుల విధానం ఇంకా అమలవుతోందని సమావేశం దృష్టికి తీసుకెళ్లగా చట్టంపై పోలీసులు అవగాహన కలిగించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఏఎస్పీ సౌమ్యలత, సోషల్ వెల్ఫేర్ డీడీ రామానందం, ఏపీజీఎల్ఐ ఎ.డి హైమవతి, ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, డీఎస్పీలు, ఆర్‌డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

లైంగికదాడి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో 2020వ సంవత్సరంలో నమోదైన లైంగికదాడి కేసులో ముద్దాయికి విజయనగరం మహిళాకోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎన్.పద్మావతి పదేళ్ల కారాగార శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వివరాలను వెల్లడిస్తూ..గరుగుబిల్లి మండలం, దళాయివలస గ్రామానికి చెందిన ఫిర్యాదిదారు జీవనోపాధి నిమిత్తం 2017వ సంవత్సరంలో ఆకివీడులోని రొయ్యల పరిశ్రమలో పనిచేస్తూ కంపెనీ హాస్టల్‌లో ఉంటూ జీవనం సాగిస్తుండగా..అదే సంవత్సరంలో గరుగుబిల్లి మండలం, కొంకడివరం గ్రామానికి చెందిన ముద్దాయి బలగ శివ జీవనోపాధి నిమిత్తం అక్కడికి వెళ్లాడని చెప్పారు. ఈ క్రమంలో బాధితురాలిని ప్రేమ పేరుతో నమ్మించి పెళ్లి చేసుకుంటానని అభయమిచ్చి పలుమార్లు శారీరకంగా లోబరుచుకుని మోసం చేశాడన్నారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2020లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విచారణలో నిందితుడిపై నేరారోపణలు రుజువైన మేరకు విజయనగరం న్యాయస్థానం పైవిధంగా శిక్ష ఖరారు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును సంబంధించి దర్యాప్తులో పాల్గొన్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

1800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


దాడుల్లో పట్టుబడిన ప్లాస్టిక్ టబ్బులను చూపిస్తున్న కురుపాం ఎక్సైజ్ సిబ్బంది


భామిని: కొత్తగూడలో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస రూరల్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చినమేరంగి గ్రామ పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా స్థావరాలపై గురువారం నిర్వహించిన దాడుల్లో 18 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 1800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈమేరకు సీఐ వీవీఎస్ శేఖర్‌బాబు, కురుపాం ఎక్సైజ్ ఎస్సైలు రాజశేఖర్, చంద్రకాంత్‌లు తమ సిబ్బందితో కలిసి ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ దాడుల్లో 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా సారా స్థావరాలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో పాటు వారికి ముడిసరుకు సరఫరా చేసిన ఇద్దరు వ్యాపారులపై దర్యాప్తు నిర్వహిస్తున్నామని, నిర్ధారణ అయితే వారిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వెయ్యిలీటర్ల సారా ఊటలు ధ్వంసం

భామిని: మండలంలోని కొత్తగూడలో గురువారం సారా అమ్మకం దారులపై దాడులు జరిపి 40లీటర్ల సారాతో ఇద్దరు అమ్మకం దారులు బిడ్డిక రవి, బిడ్డిక కొండలరావులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఏఈఎస్ ఏఎస్.దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే దాడిలో వెయ్యి లీటర్ల సారా ఊటలు ధ్వంసం చేసి సారా తయారు చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పాలకొండ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి సారథ్యంలో నవోదయం 2 కిం సారా నిర్మూలనలో భాగంగా సారా తయారీకి బెల్లం అందిస్తున్న ఘనసరకు చెందిన భూపతి షణ్ముఖపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో పాలకొండ సీఐ సూర్యకుమారితో పాటు మొబైల్ సీఐ మురళి, కొత్తూరు సీఐ కిరణ్మయి, పి.లీలారాణి, పాలకొండ ఎస్సై కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల భూముల ఆక్రమణపై విచారణ జరిపించండి

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర డిమాండ్


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలోని సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో దళితులు, గిరిజనులు, నిరుపేదల భూములు అన్యాయంగా ఆక్రమణలకు గురవుతున్నాయని, మంత్రి సంధ్యారాణికి చిత్తశుద్ధి ఉంటే వాటన్నింటిపై విచారణ జరిపించి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని మోసూరు గ్రామంలో దళితులు సుమారు 24 ఏళ్ల క్రితం, వారికి పట్టాలివ్వక ముందు నుంచి బంజరుభూములు సాగుచేసుకోగా తరువాత ప్రభుత్వం వారికి పట్టాలిచ్చిందన్నారు. ఈ పట్టాలు ఇచ్చి సుమారు 20 సంవత్సరాలు దాటిపోయిందని, సుమారు 24 ఏళ్లుగా సాగుచేస్తున్న దళితుల భూముల మీదకు ఇటీవల విచారణలో భాగంగా అధికారులు స్థానిక బీసీలను తీసుకువెళ్లడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మోసూరులో పాఠశాల భవనం కట్టిన స్థలం ప్రభుత్వానిదా? లేక జిరాయితీ స్థలమా? అన్న విషయం అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తేల్చకుండానే దళిత ఎంఈఓపై సస్పెన్షన్ విధించడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జిరాయితీ స్థలంలో పాఠశాల భవనం నిర్మించారని, పాఠశాల కావడంతో ఎవరూ ఏమీ అనలేదన్నారు. తరువాత భవనం పడిపోయి నిరుపయోగంగా ఉండడంతో, స్థలం యజమాని భూమిని అమ్మగా స్థానిక సర్పంచ్ కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకుని ఇల్లు నిర్మించుకున్నారన్నారు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు చేసిన తరువాత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదే మోసూరు గ్రామంలో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయగా, చెరువు ఆక్రమణ వాస్తవమేనని అంగీకరిస్తూ అది ఎవరు ఆక్రమించారో తెలియదని రెవెన్యూ అధికారులు పేర్కొనడం సమంజసం కాదన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు ఇవ్వాలి

నిజంగా గ్రామంలోని చెరువులు ప్రభుత్వానికి అవసరం లేకపోతే అక్కడ ఉన్న దళితులు, గిరిజనులు, బీసీ, అగ్రవర్ణ పేదలకు ఇవ్వాలని కోరారు. దళితులు, గిరిజనుల భూములను ఎక్కడైనా ఎవరైనా ఆక్రమిస్తే దర్యాప్తు చేయించి, దర్యాప్తును అనుసరించి సర్వే చేసి అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని అభిప్రాయ పడ్డారు. ఇటీవల అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో తాను మాట్లాడిన విషయాలపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడంపై రాజన్నదొర స్పందిస్తూ, తాను మాట్లాడిన విషయాలను అంశాల వారీగా ప్రజలకు మీడియా ద్వారా వివరిస్తానన్నారు. ఆ సభలో తాను అంబేడ్కర్ రాజ్యాంగం గురించి మాత్రమే మాట్లాడానని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరిరఘు, వైఎస్సార్ సీపీ నాయకుడు మొకర లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

- విజేత బలిజిపేట
- బహుమతులు అందజేసిన ఏఆర్ ఏఎస్పీ

విజయనగరం క్రైమ్: స్థానిక పోలీస్ బ్యారెక్స్‌లో నిర్వహించిన ఏఆర్ కానిస్టేబుల్ సీహెచ్.గోపాలరావు స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌లో ముగింపు వేడుకలకు ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం రాత్రి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ వాలీబాల్ పోటీలలో నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధికి చెందిన ఏఆర్,సివిల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేసిన గోపాలరావు ఏఆర్ విభాగానికి ఓ డాక్టర్‌గా సేవలందించారని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించుకోవడం ఆయన సేవలను గుర్తుంచుకోవడమేనన్నారు.ఈ టోర్నమెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచిన బలిజిపేట జట్టుకు రూ.12 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన గంట్యాడ జట్టుకు రూ.8 వేలు తృతీయ స్థానంలో నిలిచిన కొత్తవలస జట్టుకు రూ.6 వేలు కన్సొలేషన్ ప్రైజ్‌గా విజయనగరం జట్టుకు రూ.4 వేలు ఏఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్‌ఐలు గోపాలరావు, శ్రీనివాసరావు, ఆర్‌ఎస్సైలు సూర్యనారాయణ, రామారావు, మహేష్, ముబారక్ ఆలీ, దివంగత కానిస్టేబుల్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులను ఇస్తున్న ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు

ఇంటర్ తప్పిన విద్యార్థులు 22లోగా పరీక్షఫీజు చెల్లించాలి

- రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ అవకాశం
- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజుల వీణ


జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజులవీణ

పార్వతీపురంటౌన్: ఇటీవల మార్చి నెలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ కోసం ఇంటర్ బోర్డు పేర్కొన్న నిర్దిష్ట గడువులోగా ఫీజులు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీ ఫీజు చెల్లించేందుకు తుది గడువు అనే విషయాన్ని విద్యార్థుల తల్లితండ్రులు గమనించాలని కోరారు. ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరాల్లో గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.600 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. సబ్జెక్టు వారీగా ఇంప్రూవ్‌మెంట్‌కు హాజరయ్యే విద్యార్థులు రూ.600తో పాటు అదనంగా ఒక్కో సబ్జెక్టుకు రూ.160 చెప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే విద్యార్థులు రూ.275, ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సులకు హాజరయ్యే వారు రూ. 165 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ బీఐఈ.ఏపీ.జీఓవీ.ఐన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 22వ తేదీలోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మే 12న ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు మే.28 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. నైతికత, మానవ విలువలు పరీక్ష జూన్ 4న, పర్యావరణ విద్య పరీక్ష జూన్ 6న జరగనున్నట్లు వివరించారు.

పోలీస్ కుటుంబానికి సిబ్బంది 'చేయూత'

- రూ.3 లక్షల ఆర్థిక సాయం


మృతుడు గోపాలరావు కుటుంబానికి ఎస్పీ చేతుల మీదుగా చెక్కు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం క్రైమ్: ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన కానిస్టేబుల్ సీహెచ్.గోపాలరావు కుటుంబానికి ఏఆర్, సివిల్ సిబ్బంది అండగా నిలిచారు. తాము పోగుచేసిన సొమ్ము రూ.3 లక్షల 60 వేల నగదును ఎస్పీ వకుల్ జిందల్ చేతుల మీదుగా మృతుడి సతీమణి శారదకు గురువారం అందజేశారు. 2000 బ్యాచ్‌కు చెందిన ఏపీఎస్పీ, ప్రస్తుతం ఏఆర్ కన్వర్షన్‌గా బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్న మిలీనియం బ్యాచ్ కానిస్టేబుల్స్ స్వచ్ఛందంగా పొదుపు చేసిన రూ.3లక్షల 60వేలను సహచర ఉద్యోగి అకాలమరణం చెందడంతో ఆ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థికంగా భరోసా కల్పించారని ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా అన్నారు. మృతుడి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం సకాలంలో కల్పించే విధంగా చర్యలు చేపడతామని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అందుకుగల సర్టిఫికెట్లను డీపీఓలో అందచేయాలని మృతుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్‌ఐలు గోపాలనాయుడు, రమేష్, శ్రీనివాస్ రావు, మిలీనియం బ్యాచ్ కానిస్టేబుల్స్ వెంకటేశ్వరావు, ఉమా మహేశ్వరరావు, పైడితల్లి, కృష్ణమోహన్, శేషగిరి, రమేష్, మోహన్, రమేష్, హరిశంకర్, చిట్టిబాబు, సీతారాం, చక్రధర్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.